ప్రజాశక్తి
ఆదివారం 15 జూన్, 2025
5
శ్రీకాకుళం



నేడు మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన



ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలిలో ఆదివారం సాయంత్రం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు పర్యటించనున్నారని టిడిపి క్యాంప్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన వచ్చింది. టెక్కలిలోని పట్టుమహాదేవి కోనేరు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రావివలస, చిన్ననారాయణపురం, దామోదరపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

వేటకు సిద్ధం



బుడగట్లపాలెం తీరంలో ఉన్న బోట్లు

- **నేటి నుంచి చేపల వేట ప్రారంభం**
- **ముగిసిన రెండు నెలల విరామం**

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వేట నిషేధ కాలం ముగిసింది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులు గడిసింది. మత్స్యకారులు వలలు, బోట్లు సిద్ధం చేస్తున్నారు. వేట అదివారం నుంచి ప్రారంభకానుంది. మత్స్యకారుల సేవలో అన్న పథకం ప్రభుత్వం ప్రారంభించింది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెంలో ముఖ్యమంతి నారా చంద్రబాబునాయుడు ఈ పథకాన్ని ఏప్రిల్ 16న ప్రారంభించారు. జిల్లాలో మత్స్యకారుల సేవలో పథకంలో భాగంగా 15548 లబ్ధిదారులకు అందజేశారు. ఒక్కరికీ రూ.20 వేలు చొప్పున రూ.31,09,60,000 అందజేశారు. చాలామంది అర్హులకు ఈ పథకంలో డబ్బులు పడలేదని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు చేశారు. అయినా సమస్యమాత్రం పరిషారం కాలేదు. ప్రధానంగా రేషన్ కార్డులో ఒక్కరికీ పథకం అందజేయడం వల్ల కొందరు అర్హులు పథకానికి దూరమయ్యారు. జిల్లాలో సాంకేతిక లోపాలు వల్ల 728 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 193 కిలో మీటర్ల తీరం విస్తరించి ఉంది. 154 మత్స్యకార గ్రామాల్లో మత్స్యకారులు వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 2.10 లక్షలు చేపలు వేటపై ఆధార పడుతున్నారు.

ఈ 61 రోజుల్లో చేపలు పిల్లలు పెట్టటం, పెరగటం చేస్తాయి, మత్స్య సంపద పెరిగేందుకు ఈ విరామం జాతీయ స్థాయిలో ఏటా వేట నిషేధం అమలు చేస్తారు. ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులకు ఆర్థికంగా ఆదుకునేందుకు మత్స్యకారుల సేవలో పథకం అమలు చేస్తున్నారు. జిలాల్లో సముద్రతీరం రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం రూరల్, గార, పోలాకి, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో విస్తరించి ఉంది. మత్స్యకారులకు చేపలు వేట తప్ప ఇతర వృత్తులు తెలియదు. అందుకు గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు వెళ్లి వలస జీవనం సైతం సాగిస్తున్నారు. స్థానిక మత్స్యకారులు నిషేధ సమయం పూర్తి కావడంతో వేటకు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో మత్స్యకార మండలాలు	: 11
బోట్లు	: 4,133
మత్స్యకారుల సేవలో లబ్ధిదారులు	: 15,548
ఖాతాల్లో జమైన నగదు	: రూ.31,09,60,000

నిషేధ కాలం పూర్తయింది



61 రోజుల వేట నిషేధ కాలం పూర్తయింది. ప్రస్తుతం వేట మత్స్యకారులు కొనసాగించవచ్చు. ప్రకృతి విపత్తులు శాఖ సూచనలు పాటిస్తూ వేట కొనసాగించాలి. వేట నిషేధ కాలంలో సహకరించారు. అర్హులకు మత్స్యకారుల సేవలో పథకం ప్రభుత్వం మంజూరు చేసింది.

- వై.సత్యనారాయణ,
మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

వేటకు సన్నద్ధం అవుతున్నాం



వేటకు మత్స్యకారులు సన్నద్ధం అవుతున్నాం. గ్రామాల్లో అర్హులందరికీ మత్స్యకారుల సేవలో పథకం వర్తించ చేదు. అధికారులకు ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకు పరిష్కారం కాలేదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- మైలపల్లి పట్టాభి,
బడివానిపేట, ఎచ్చెర్ల మండలం



శ్రీకాకుళం సిటీ : అవినాష్



సోంపేట : సాయివర్ధన్



నరసన్నపేట : జుహిత



నౌపడ : సాయిచరణ్

'నీట్'లో మెరిసిన సిక్కోలు విద్యార్థులు

ఆలిండియాలో 64వ ర్యాంకు సాధించిన అవినాష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

డాక్టర్ కావాలనే కళను సాకారం చేసుకనేందుకు వేసిన మొదటి అడుగు గొప్పగా వేశాడు శ్రీకాకుళం కుర్రాడు. అరసవల్లి సమీపంలో నివాసంటున్న పొదిలాపు అవినాష్ నీట్ యుజి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించాడు. శనివారం వెలువడిన ఈ ఫలితాల్లో అవినాష్ (హెచ్‌టి: 250410036374) ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 64వ ర్యాంకు సాధించి విజయదుందుబీ మోగించాడు. మొత్తం 720 మార్కులకు గాను 652 మార్కులు సాధించి రాష్ట్రంలో టాప్ 5 జాబితాలో చోటు దక్కించుకున్నాడు. దీంతో జిల్లా నుంచి ఆల్‌టైం రికార్డు సృష్టించి జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు. అరసవల్లికి చెందిన కుర్రాడు ఆలిండియాస్థాయిలో అదిరేటి ర్యాంకు సాధించడంపై స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అవినాష్ తండ్రి పొదిలాపు శ్రీనివాసరావు ఎడికల్ ఫీల్డ్‌లో వ్యాపారం చేస్తున్నారు. తల్లి భారతి గృహిణి, చిన్నప్పటి నుంచి చదువుల్లో ఆణిముత్యమనిపించేలా రాణిస్తూ వచ్చాడు అవినాష్ ప్రాథమిక విద్య నగరంలోని గీతాంజలిలో చదువుకున్నారు. సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్షలో ర్యాంకు సాధించాడు. దీంతో విజయనగరంలోని కోరుకొండ సైనిక్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం సాగించాడు. సిబిఎస్‌సి పదో 500/470 మార్కులు సాధించి 94 శాతంతో ఉత్తీర్ణత సాధించాడు. డాక్టర్ కావాలనే తన కలను సాకారం చేసుకోవడం కోసం విజయవాడలోని గోశాలలో శ్రీచైతన్య జూనియర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బైసిపిలో చేరి 983 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం కోటపాడు పంచాయతీ కాశీపురానికి చెందిన దాసరి సాయి చరణ్ నీట్ ఫలితాల్లో ఆల్ ఇండియా 7,999 ర్యాంకు సాధించారు. అలాగే ఒబిసి విభాగంలో 3,276 ర్యాంకు సాధించారు. సాయి చరణ్ తండ్రి గోవిందరావు ఇంటలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. తల్లి గృహిణి. వైద్యుడు కావాలన్నదే తన లక్ష్యంగా సాయిచరణ్ తెలిపారు.

నరసన్నపేట : నీట్ ఫలితాల్లో సారవకోట మండలం అలుదుకు చెందిన పాగోటి జుహిత ఉత్తమ ర్యాంకు సాధించిందని ఎజిఎంఐ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా నరసన్నపేటలో విలేకరులతో మాట్లాడారు. తమ విద్యార్థిని నీట్ ఫలితాల్లో ఆల్ ఇండియాలో 2,744 వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 979 ర్యాంకు సాదించడం అభినందనీయమన్నారు. జుహిత తండ్రి మురళీధరరావు బ్యాంకు ఉద్యోగి. తల్లి గృహిణి. జుహిత పదో తరగతి నారాయణ స్కూల్ ఇంటర్మీడియట్ విశాఖపట్నం నారాయణ కాలేజీలో చదువుకున్నారు. ఎజిఎం ఐ.రమేష్, ప్రిన్సిపాల్ ఎ.రమేష్, డీన్ హరి, ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.

సోంపేట : నీట్ పరీక్ష ఫలితాల్లో సోంపేట పట్టణానికి చెందిన సాయి వర్ధన్ ఆల్ ఇండియా లెవెల్‌లో 942వ ర్యాంకు సాధించాడు. ఒబిసి కేటగిరీలో 227 వరకు ర్యాంకు సాధించాడు. సాయివర్ధన్ తల్లిదండ్రులు రోబ్బి ధర్మారావు, ఈశ్వరిలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

పోలాకి: నీట్ ఫలితాల్లో మండలంలోని తోటాడకు చెందిన తగ్గ మైత్రికి రాష్ట్రస్థాయిలో 2,672 ర్యాంకు సాధించింది. ఈమె ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు వైకుంఠరావు, ప్రభావతి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



నిందితులను ప్రవేశపెట్టిన డిఎస్‌పి వివేకానంద

ముగిసిన ఎస్‌జిటి కౌన్సెలింగ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఈ నెల 11 నుంచి ప్రారంభమైన ఎస్‌జిటి ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ శనివారంతో ముగిసింది. ఉపాధ్యాయ ఐక్య వేధిక పోరాటంతో ప్రభుత్వం మా న్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించింది. శ్రీకాకుళం రూరల్ మండలం గు రజాడ కళాశాలలో ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. చివరి రోజు 8,500 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రధానంగా ఏనిమిదేళ్లు పూర్తి చేసుకున్న వారికి, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య దగ్గిన వారికి కృతంగా స్థానచలనం కలిగింది. కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. డిఇఒ తిరుమల చైతన్యతో కూడిన అధికారులు కౌన్సెలింగ్ పర్యవేక్షించారు.

సిబిఐ అంటూ సైబర్ నేరాలు

శ్రీకాకుళం డిఎస్‌పి వివేకానంద

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర సైబర్ నిందితులను శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారని డిఎస్‌సి హెచ్.వివేకానంద తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత నెల 14న జెమ్స్ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్, వైద్యులు పి.రేవతి సైబర్‌నేరంపై శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో నిందితులు రుమాన్ షరీఫ్ (కర్నాటక), నౌపాల సెరైన్ (కాలికట్), నజూము ద్దీన్ చక్ల తోపు (కేరళ) శక్రవారం అరెస్టు చేశామని చెప్పారు. వీరి నుంచి రూ.ఆరు లక్షలు రికవరీ చేశామన్నారు. సైబర్ నేర గాళ్లు ఆన్‌లైన్ ద్వారా ఆర్థికంగా పలుకుబడి ఉన్న డాక్టర్లను, వ్యాపారస్తులను, డబ్బులున్న వారిని లక్ష్యం చేసుకుని సైబర్ క్రైమ్‌కు పాల్పడ్డారని తెలిపారు. ఆధార్‌తో అనుసంధానం చేసిన ఫోన్ నంబరులను సేకరించి సిబిఐ నుంచి ఫోన్ చేస్తున్నట్టుగా నమ్మించి డబ్బులు అకౌంట్‌లో జమ చేసుకోవడంతో ముగ్గురు అనేక నేరాలకు పాల్పడ్డారని తెలిపారు. అందులో భాగంగా కిమ్స్ రోడ్డులోని క్రాంతి ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న డాక్టర్ రేవతి నుంచి రూ.13.50 లక్షలు డిపాజిట్ చేయించుకుని మోసానికి పాల్పడ్డారని తెలిపారు. అమ్మాయిలను బ్లాక్‌మెయిల్ చేసి హ్యూమన్ ట్రాఫికింగ్ చేయించే కేసులో మీరు పేరు ఉందని సైబర్ నేరగాళ్లు డాక్టర్‌ను బెదిరించారని అన్నారు. సిబిఐ కేసు నమోదు చేసి విచారిస్తున్నారని, ఈ కేసులో ముద్దాయిలుగా ఉంటారని ఆమెను భయపెట్టారని తెలిపారు. ఈ కేసు విషయంలో సుప్రీంకోర్టులో రేవతి తరుపున వాదించడానికి కొంత సొమ్ము డిపాజిట్లు చేయాలని అన్నారు. అంతవరకు మీ అరెస్టు ఆగుతుందని నమ్మబలికించారని అన్నారు. దీంతో ఆమె భయపడి వారు చెప్పిన పలు అకౌంట్లకు రూ.13.50 లక్షలు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేశారని తెలిపారు. కొన్ని రోజులకు తాను మోసపోయానని గుర్తించి శ్రీకాకుళం రూరల్ పోలీసులకు ఫిర్యాదు రేవతి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఎస్‌పి ఆదేశాల మేరకు కేసు ఛేదించామన్నారు. శ్రీకాకుళం వన్ టౌన్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తే... నిజాలు బయిటపడ్డాయని అన్నారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సిఐ పైడపునాయుడు, ఎస్ఐలు రాజేష్, ఎం.హరికృష్ణ పాల్గొన్నారు.

టిడిపి విస్తృత సమావేశం రసాభాస

- **కొలిక్కి రాని అధ్యక్షుని ఎన్నిక**
- **పార్టీ అధిష్టానం దృష్టికి సమస్య**

ప్రజాశక్తి- లావేరు

శాసనసభా పక్ష నాయకుడిని ఎన్నికోవడం తేలిగ్గానే జరుగుతుంది కానీ, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడిని ఎన్నికోవడం కష్టతరంగా మారింది. మూడేళ్ల తర్వాత పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి ఏకాభిప్రాయం రాకపోవడంతో వాయిదా పడింది. అలాగే 42 ఏళ్ల టిడిపి చరిత్రలో పోలీసులు బందోబస్తు మధ్య సమావేసం నిర్వహించడం ఇక్కడి పరిస్థితి దిగజారింది. మండల కేంద్రంలో చంద్రశేఖర్ స్వామి కళ్యాణ మండపంలో శనివారం సాయంత్రం టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్ అధ్యక్షతన మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మార్కఫెడ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్, ఎచ్చెర్ల నియోజకవర్గ పరిశీలకులు అనేపు రామకృష్ణనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో ముందుగా పార్టీ అధ్యక్షుని కమిటీ ఎన్నిక కోసం పంచాయతీలు వారీగా నాయకుల నుంచి అభిప్రాయలను చెప్పాలని ఎంపీ సూచించించారు. ముందుగా ముప్పిడి సురేష్, పిన్నింటి మధుబాబు, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఆర్.ప్రకాశరావు, గొర్లె శ్రీనివాసరావుతో పాటుగా మరి కొందరు పాత కార్యవర్గాన్ని కొనసాగించాలని వారి అభిప్రాయన్ని వ్యక్తం చేశారు. కునపల్లి దామోదరరావు, ఎల్. నారాయణరావు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని అభిప్రాయన్ని వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొన్ని హేమసుందర్ మేం చెప్పినట్టుగా కొత్త కార్యవర్గాన్ని ఆమోదించాలని ఎంపీ అప్పలనాయుడుకి సూచించారు. దీంతో పాత కార్యవర్గాన్ని ఆమోదించాలని చెప్పినా వారు అడ్డు తగిలారు. అలా కుదరదని అభ్యంతరం చెప్పడంతో ఇరు గ్రూపుల మధ్య తోపులాటలు, వాదులాట చోటుచేసుకుంది. ఎంపీ పలుమార్లు సర్దిచెప్పినా వినకపోవడంతో సమావేశం గందరగోళం ఏర్పడింది. పలుమార్లు తోపులాట, యుద్ధ వాతావరణం చోటుచేసుకుంది. దీంతో లావేరు ఎస్ఐ జి.లక్ష్మణరావు తన సిబ్బందితో వచ్చి కష్టపడి వివాదాన్ని సద్దుమణిగించారు. మరలా రెండోసారి అభిప్రాయలు సేకరణ ప్రారంభించారు. మళ్లీ యుద్ధం తలపించేలా సభాప్రాంగణం అరుపులు, తిట్లు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో మెజార్టీ కేడర్ పాత కమిటీనే కొనసాగించాలని, 20 శాతం కొత్త కమిటీకి అవకాశం ఇవ్వాలని ఎవరి వాదన వారు వినిపిస్తున్నారు. పరిస్థితి చేయిదాటిపోవడంతో చేసేది ఏమిలేక ఎంపీ, పరిశీలకులు ఈ విషయం టిడిపి అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని తెలిపి చేతులెత్తేశారు. దీంతో అర్ధాంతరంగా సమావేశాన్ని ముగించి వెళ్లిపోయారు. పార్టీ 43 ఏళ్ల ప్రతిష్టను బహిరంగంగా మంట గలిసిందని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తూ... నొచ్చుకుంటు నిట్టూరుస్తూ వెళ్లారు. పార్టీ సమావేశం పోలీసుల బందోబస్తు మధ్య నిర్వహించడం సిగ్గుచేటని మండిపడ్డారు. మొత్తానికి లావేరు మండలం కంచుకోటగా ఉన్న దాన్ని వీధులు పాలు చేశారని కార్యకర్తలు పలువురు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.



అదుపు చేస్తున్న పోలీసులు

మనిషి ప్రాణానికి రక్తం అవసరం

డిఎంహెచ్‌ఒ అనిత

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మనిషి ప్రాణానికి రక్తం ఎంతో అవసరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత వెల్లడించారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శనివారం రిమ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషి శరీరంలో సుమారు ఆరు లీటర్లు రక్తం ఉంటూ నిరంతర శరీరంలోని వివిధ భాగాలు చేరుతుందన్నారు. రక్త కణాల వయసు 120 రోజులు మాత్రమే ఉంటుందన్నారు. 120 రోజులు తర్వాత కమేణా రక్త కణాలు నశించిన తర్వాత కొత్త రక్త కణాలు ఎముక మజ్జి నుండి పుట్టూకొస్తాయని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియని చెప్పారు. రక్త దానం చేయడం వల్ల మరొక వ్యక్తి ప్రాణం నిలబడుతుందన్నారు. పెద్ద పెద్ద ప్రమాదాలు సంభవించినప్పుడు రక్తం పోతుందని, రక్తం పోయిన తర్వాత మనిషి ప్రాణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. అలాంటి సమయంలో రక్తం అందించాలన్నారు. జిల్లాలో ఆరు రక్త సేకరణ కేంద్రాలు ఉన్నాయని, వీటి ద్వారా రక్త సేకరణ చేపడుతున్నామని తెలిపారు. ప్రమాదాలు జరిగిన వ్యక్తులకే కాకుండా సికిల్ సెల్, తలసేమియ?, తదితరులకు రక్తం సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ప్రతిఒక్కరూ రక్తదానం దానం చేయాలని పిలుపునిచ్చారు. అదనపు డిఎంహెచ్‌ఒ డాక్టర్ శ్రీకాంత్, ప్రభుత్వాస్పత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ డి.పార్వతి మాట్లాడారు. కార్యక్రమంలో ఆస్పత్రి పరిపాలనాధికారి డాక్టర్ బి.రాజశేఖర్‌రెడ్డి, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.సునీత ఎన్‌సిసి కెప్టెన్ మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ అనిత

అగ్ని ప్రమాద ఘటనలో దురుద్దేశం లేదు

ఎస్‌పి మహేశ్వర రెడ్డి



శ్రీకాకుళం సిటీ: హిరమండలం మండలం కూర్మ రాధాకృష్ణ ఆలయంలో మంగళవారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాద ఘటనలో ఎటువంటి దురుద్దేశం లేదని, ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడుతున్నామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నిప్రమాద ఘటనలో వ్యక్తిగతంగా, అల్లరి మూకలు ప్రమేయం లేదని అన్నారు. దీపాలతో పూజ చేసి తలుపులు వేసిన అనంతరం పొరపాటున అగ్నిప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నామని తెలిపారు. ఈ ఘటనపై ఇప్పటికే ప్రమాద స్థలంలో ప్రాథమిక ఆధారాలు సేకరించి విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పరీక్షలు నిమిత్తం పంపించామన్నారు. సాంకేతిక ఆధారాలు బట్టి అన్ని కోణాల్లో ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా ఘటనకు దీపాల వల్ల సంభవించిన అగ్నిప్రమాదమే ప్రధాన కారణమని, అవాస్తవాలు, వదంతులు ప్రజలు ఎవరూ నమ్మవద్దని కోరారు. అవాస్తవాలు ప్రచారం చేసిన వారిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు.

అసహనానికి ఉపశమనం



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

విజనరీ లీడర్‌గా టిడిపి శ్రేణులు కీర్తిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టిడిపి కూటమి ప్రభుత్వంపై క్రమేణా పెరుగుతున్న అసంతృప్తిని చాలా వేగంగా గుర్తించినట్లుంది. ప్రజల్లో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో సూపర్ సిక్స్ హామీల్లో ఒక ముఖ్యమైన హామీ అయిన తల్లికి వందనం పథకాన్ని పెద్దగా చర్చలేకుండానే అమలు చేసింది. హామీల్లో ఏ ఒక్కంటినీ సమయానికి అమలు చేయని కూటమి ప్రభుత్వం ఈ పథకం విషయంలో బడులు తెరిచిన మరుసటి రోజే తల్లుల ఖాతాల్లో డబ్బులు జమచేయడం మొదలు పెట్టింది. సాధారణంగా ఒక సంక్షేమ పథకాన్ని అమలు చేసే సందర్భంలో జనం నుంచి ఆ క్రెడిట్ పొందేందుకు ప్రజల మధ్య ప్రారంభిస్తూ వచ్చిన చంద్రబాబు ఈ విషయంలో మాత్రం ఎటువంటి హడావుడి లేకుండానే పథకాన్ని అమలు చేయడం, డబ్బులు జమ కావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఉత్తర్వులు జారీ, ఆ వెనువెంటనే డబ్బులూ జమ చేయడం, అమలు చేయడం ప్రజల్లో నెలకొన్న అసహనానికి కొంత ఉపశమనం కలిగించినట్లయింది. తల్లికి వందనం పేరిట ఒక్కో విద్యార్థికి రూ.13 వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేయడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివెరిసింది. మొదటి ఏడాదికి ఎగనామం పెట్టినా, రెండో ఏడాది పాఠశాలల ప్రారంభం రెండో రోజునే డబ్బులు జమ చేసి వాగ్దానం అమలు చేసింది. తల్లికి వందనం సొమ్ములను ఈ నెల 13వ తేదీ నుంచే జమ చేయడంతో జిల్లాలో ఒక హడావుడి కనిపించింది. డబ్బులు వచ్చాయా? అంటూ ఒకరినొకరు పరస్పరం సంప్రదించుకోవడం, వివిధ కారణాలతో పథకానికి నోచని వారు ఒకింత నిరాశకు గురికావడం కనిపించింది.

పథకం లబ్ధిదారుల ఎంపికలో గతంలో వైసిపి ప్రభుత్వం అమలు చేసిన ఆంక్షలనే ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వమూ అమలు చేయడం ఇందుకు కారణంగా ఉంది. అర్బన్ ప్రాంతాల్లో నెలకు రూ.12 వేలు, గ్రామీణ ప్రాంతంలో నెలకు రూ.10 వేలు వేతనం పొందుతున్న వారిని అనర్హులుగా చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నిబంధనతో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధి హామీ తదితర చిరుద్యోగులు, అంగన్వాడీలు, ఆశా వంటి స్కీం వర్కర్ల పిల్లలు ఈ పథకానికి నోచుకోలేకపోయారు. సాధారణ ఉద్యోగులకు చెల్లిస్తున్న వేతనాల్లో మూడో వంతు కూడా ఇవ్వకుండా, వారికి ఎటువంటి ప్రయోజనాలు వర్తింపచేయకుండా ఆ తరగతులను మినహాయించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గతంలో ఏజెన్సీల ద్వారా వేతనాలు చెల్లించే పరిస్థితి ఉండగా, 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటిని రద్దు చేసి కాంప్రెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజిమెంట్ సిస్టమ్ (సిఎఫ్‌ఎంస్) ద్వారా వేతనాలు చెల్లించే విధానాన్ని తీసుకొచ్చింది. దీంతో ఆ సాఫ్ట్‌వేర్‌లో వారంతా ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదయ్యారు. ప్రస్తుతం అమలు చేసిన తల్లికి వందనం పథకానికి వారంతా అనర్హులయ్యారు. అయితే ఇందులో గమ్మత్తేమిటంటే ప్రభుత్వ కార్యాలయాల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తూ... నిర్దేశించిన వేతనానికి మించి కొందరు పురుషులు జీతం తీసుకుంటున్నా, ఆ ఇంట్లో మహిళలకు ఈ పథకాన్ని వర్తింపచేయడం పథకం అమల్లో శాస్త్రీయత లోపించిందనే విమర్శలకు తావిచ్చింది.


కుటుంబంలో మూడెకరాలు పల్లం, పదెకరాలు పల్లం భూమి ఉన్న వారి కుటుంబాలకు ప్రభుత్వం పథకం వర్తింపులోనూ అస్త్రీయంగానే సాగింది. తల్లిదండ్రులకు భూములు ఉన్నా వారు విడిగా రేషన్ కార్డులో ఉండటం, వారి కుమారులు వేర్వేరు రేషన్‌కార్డుల్లో ఉండటంతో అటువంటి కుటుంబాలకు తల్లికి వందనం వర్తించింది. దీంతో ప్రభుత్వం పేర్కొన్న భూమికి మించి ఉన్న కుటుంబాలు సైతం లబ్ధిపొందాయి. తల్లిదండ్రుల నుంచి భూమి బదిలీ కావడంతో కొన్ని కుటుంబాలకు చెందిన పిల్లలు పథకానికి దూరమయ్యారు. మున్సిపాల్టీల్లో వెయ్యి చదరపు అడుగులకు మించి ఉంటే అటువంటి కుటుంబాల పిల్లలనూ ప్రభుత్వం అనర్హులుగా చేసింది. భూముల నిబంధన మాదిరిగానే ఇందులోనూ చాలా మందికి అన్యాయం జరిగింది. ఒకే ఇంటిలో ఉంటున్నా... ఆస్తులు తమ పేరు లేని వారు అర్హత సాధించగా, ఉన్న వారు అనర్హులుగా మిగిలిపోయారు. ఈ రకమైన అశాస్త్రీయ వడపోతలతో తల్లికి వందనం డబ్బులు ఒకరికి వచ్చి, మరొకరికి రాకపోవడం ద్వారా ప్రజల మధ్య ప్రభుత్వమే వివక్ష చూపినట్లయింది. నాలుగు చక్రాల వాహనం కలిగి ఉండటం, ఆదాయపు పన్ను కలిగి ఉన్న వారిని అనర్హులుగా చేయడంతో కొన్ని పేద కుటుంబాలు పథకానికి దూరమయ్యాయి. ఒకేరేషన్ కార్డులో మిగిలిన కుటుంబ సభ్యులు ఉండటంతో వారి పిల్లలకు పథకం వర్తింపచేయలేదు. ఈ రకంగా అన్ని రకాల వడపోతతో లబ్ధిదారుల సంఖ్యను ప్రభుత్వం కుదించింది. తల్లికి వందనం పథకంలో ప్రభుత్వ గణాంకాలే ఇందుకు ఉదాహరణ. జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్ వరకు మొత్తం 3,02,460 మంది ఉన్నా... 2,28,659 మందికి మాత్రమే పథకాన్ని వర్తింపచేసి మిగిలిన వారికి కోత పెట్టింది.

అన్నదాత సుఖీభవ పథకాన్ని మరో వారం పది రోజుల్లో అమలు చేస్తామని ప్రభుత్వం చెప్తోంది. అన్నదాత సుఖీభవ కూడా అందరికీ అందడం సందేహంగానే ఉంది. ఈ పథకానికీ దాదాపు అవే నిబంధనలూ అమలు చేయనుందనే వార్తలు వస్తున్నాయి. పథకం అమలుకు సంబంధించి రూపొందించిన అశాస్త్రీయ విధానాలను సమీక్షించి అందరికీ వర్తింప చేస్తే రైతులకు మేలు చేకూరుతుంది. దీంతో పాటు సాంకేతిక సమస్యలు, రెవెన్యూ చిక్కులు ఎదురవ్వడంతో వేలాది మంది రైతుల వివరాలు పెండింగ్‌లో పెట్టారు. గత వైసిపి ప్రభుత్వంలో చేపట్టిన భూ సమగ్ర సర్వే సందర్భంగా అనేక భూ సమస్యలు తలెత్తాయి. అవి ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉండటంలో సుఖీభవ దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా జయింట్ ఎల్‌పిఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్)లు, ఆధార్ అనుసంధానంలో తప్పిదాలు, మ్యుటేషన్లు, మృతుల పేర్లతో భూమి ఉండటం వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులు తమకు ఆర్థికసాయం అందుతుందో? లేదోనన్న ఆందోళన చెందుతున్నారు. వీటిని పరిష్కరించి అందరికీ పథకం కిందసాయం అందిస్తే ప్రభుత్వం ఆశిస్తున్న ప్రయోజనం కొంత వరకైనా నెరవేరుతుంది. లేకుంటే తల్లికి వందన పథకం మాదిరిగా అన్నదాత సుఖీభవ అమల్లోనూ విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుంది. సంక్షేమ పథకాలు అమలు చేసే విషయంలో అంక్షలు, అశాస్త్రీయ విధానాలతో నిజమైన లబ్ధిదారులను దూరం చేస్తే దక్కాలిన క్రెడిట్ కంటే విమర్శలే మూటగట్టుకోవాల్సి వస్తుందనే విషయం కూటమి ప్రభుత్వం, అందులో భాగస్వాములు ఉన్న పార్టీలు గుర్తెరగాలి.

ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా సుధాకర్


డాక్టర్ సుధాకర్

ఆమదాలవలస: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, టిడిపి సీనియర్ నాయకులు డాక్టర్ చాపర సుధాకర్ ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమి తులయ్యారు. విజయవాడలోని ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీకి ప్రభుత్వం 8 మంది సభ్యులతో కూడిన కొత్త ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నియామకానికి సిఎం చంద్రబాబు నాయుడు ఆమోదించారు. ఈ నియామకంలో శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసకు చెందిన డాక్టర్ చాపర సుధాకర్ ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో హెల్త్ యూనివర్సిటీకి జిల్లాకు చెందిన సుధాకర్‌ను ఎంపిక చేయడంపై పలువురు అభినందిస్తున్నారు. జిల్లాకు మొట్ట మొదటిసారిగా ఈ అవకాశం కల్పించారు. ఈ నియామకంపై సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు సుధాకర్ ధన్యవాదాలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి అప్పగించిన ఈ బాధ్యతలకు న్యాయం చేకూరుస్తూ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న దుర్గారావు

టిటిడి కళ్యాణ మండపం నిర్మించాలి

పలాస : పలాసలో టిటిడి కళ్యాణ మండపం నిర్మించాలని జనసేన నియోకవర్గ సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు కోరారు. ఈ మేరకు అమరావతిలో దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాసలో ప్రయివేటు ఫంక్షన్ హాల్ సామాన్యులు వివాహాలు, ఇతర వేడుకలు చేసుకోవాలంటే రూ. 60 వేల నుంచి లక్ష దాటుతుందని అన్నారు. దీనిపై మంత్రి స్పందించి రూ. 2 కోట్ల వ్యయంతో పేదలకు తక్కువ ఖర్చుతో వివాహాలు జరుపుకునేందుకు వీలుగా చక్కటి సౌకర్యాలతో టిటిడి కళ్యాణ మండపం నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. జిల్లాకు చెందిన కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న కృష్ణారావు

సాంకేతిక పరిజ్ఞానం తప్పనిసరి

కవిటి: విద్యార్థులకు ప్రాథమిక దశనుంచే సాంకేతిక విద్య అందించాలని బివికె కరస్పాండెంట్ బల్లెడ కృష్ణారావు, సామాజిక సంఘ సభ్యుడు జి.దాసప్ప అన్నారు. రౌండ్‌టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇండియా వారి ఆర్థిక సాయంతో కవిటి బివికె పాఠశాలలో పది కంప్యూటర్లతో ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జగతి బివికె కరస్పాండెంట్ పి.జానకిరామయ్య, ప్రబంధ కారిణి అధ్యక్షుడు బల్లెడ యజ్ఞానంద్, డి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

రణస్థలం: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి, సంరక్షించాలనే సాంప్రదాయాన్ని పిల్లలకు బాల్యదశ నుంచే అలవాటు చేయాలని హరిత సమగ్ర గ్రామీణాభివద్ధి సొసైటీ వ్యవస్థాపకులు ఆర్.హరిబాబు అన్నారు. శనివారం హరిత సొసైటీ కార్యదర్శి పి.తవిటినాయుడు, అనసూయ దంపతుల కుమార్తె షాలిని పుట్టినరోజు సందర్భంగా తమ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని సంచాంలో అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో నీడనిచ్చే మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం రోజున మొక్కలను నాటడం, మొక్కలను బహుమతిగా అందజేయడం ఆనవాయితీగా మార్చుకోవాలన్నారు. గ్రామ పెద్దలు హేమలరావు, సూరపునాయుడు, సంస్థ సభ్యులు కొట్నాల శివకేష్, వై.భాస్కరరావు, మీసాల ప్రసాద్, చందక వేణు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటాలకు పాలాభిషేకం

కోటబొమ్మాళి: ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేసిన తరుణంలో స్థానిక ప్రకాశ్‌నగర్ కాలనీలో టిడిపి మండల అధ్యక్షుడు బోయిన రమేష్, కూటమి నాయకులకు మహిళలు శనివారం పాలాభిషేకం చేశారు. ఇంట్లో ఎంతమంది చదువుకున్న విద్యార్థులు ఉంటే వారి అందరికి రూ.15వేలు చొప్పున్న ఇస్తామని చెప్పి ఇచ్చిన మాట ప్రకారం తల్లి ఖాతాలలో డబ్బులు వేసిన నాయకులకు వారు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : తల్లికి వందనం తల్లుల ఖాతాల్లో డబ్బులు పడడంతో తల్లులు కూటమి నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. బెల్లుపడలో వార్డు టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.జానకిరామ్ ఆధ్వర్యాన నిర్వహించారు.

రెవెన్యూశాఖలో భారీగా బదిలీలు

శ్రీకాకుళం సిటీ : జిల్లా రెవెన్యూ శాఖలో భారీగా బదిలీలు చేస్తూ శనివారం కలెక్టర్ స్వప్నిక్ దినకర్ ఉత్తర్వులు జారీ చేశారు. 33 మంది డిప్యూటీ తహశీల్దార్లు బదిలీలయ్యారు. 19 మంది క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి బదిలీ అయ్యింది.

'అన్నదాత సుఖీభవ'కు బయోమెట్రిక్


మెళియాపుట్టి : అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకానికి లబ్ధిదారులు రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 20లోగా లోపల బయోమెట్రిక్ చేయించికోవాలని మండల వ్యవసాయ అధికారి దానకర్ణుడు తెలిపారు. ఈ సందర్భంగా మర్రిపాడు (సి) రైతు సేవా కేంద్రంలో పలువురూ రైతులకు బయోమెట్రిక్ వేయించారు.

విశాఖలో 'యోగాంధ్ర'కు సన్నద్ధం

శ్రీకాకుళం సిటీ: యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో ఈ నెల 21న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగాంధ్రకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, విద్యార్థులు, అధికారులు హాజరుకావాలన్నారు జిల్లా కేంద్రంలోని 80 అడుగుల రోడ్డులో శనివారం సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.

పాతపట్నం : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో యోగాంధ్రలో భాగంగా యోగసనాలు వేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ మంచు కరుణాకరరావు, ఎంపిడిఒ చంద్రకుమారి, డిటి రమణ, ప్రసాదరావు, పంచాయతీ కార్య నిర్వహణాధికారి రామచంద్రరావు, యోగా శిక్షకులు రమేష్ పాల్గొన్నారు. అలాగే తెంబూరు, తిడ్డిమి, గంగువాడ, లాబర, కొరసవాడ పంచాయతీల్లో యోగాసనాలు వేశారు.

కోటబొమ్మాళి: యోగాతోనే ఆరోగ్యం సాధ్యపడుతుందని, మానవుని జీవితంలో యోగా అనేది ఒక భాగం కావాలని ఎపిఒ జి.హరిప్రసాద్ అన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రోజూ సాధనలో భాగంగా శనివారం మండలంలోని కస్తురిపాడులో కూలీలతో యోగాపై శిక్షనా కార్యక్రమం నిర్వహించారు.


యోగాసనాలు వేస్తున్న అధికారులు

'తల్లికి వందనం'కు అన్నీ ఆంక్షలే

- మొదటి ఏడాదే రూ.2 వేలు కట్
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి తూట్లు పొడిచారు. పథకం ద్వారా లబ్ధిదారుల తల్లులకు కష్టాలు పెడుతున్నారు. సచివాలయం పరిధిలో వందల సంఖ్యలో చాలామంది లబ్ధిదారులకు తల్లికి వందన పథకానికి అనర్హులుగా ప్రకటించడంతో ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలు ఉన్న అంత మందికి తల్లుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తామని చెప్పి ప్రస్తుతం విపరీతమైన ఆంక్షలు పెట్టి ఎంతో మంది పథకానికి దూరమయ్యారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటలకు నేడు పథకం అమలుకు పొంతన లేకుండా పోయింది. దీంతో లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు పలాస, వజ్రపుకొత్తూరు మందస మండలాల్లో వేల సంఖ్యలో తల్లికి వందనం పథకానికి అనర్హులుగా గుర్తించడంతో లబోదిబోమంటున్నారు. పలాస మండలంలో సుమారు 803, మున్సిపాలిటీలో 1758 మంది అనర్హులుగా ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. వాస్తవానికి అందులో ఎంతో మంది అర్హులు అయినప్పటికీ వివిధ రకాలను చూపించి అనర్హులుగా గుర్తించడంతో ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో పథకం వర్తించనా... ఈ ప్రభుత్వంలో ఎందుకు వర్తించడం లేదని ప్రశ్నిస్తున్నారు.

ఇవీ... ఆంక్షలు

కుటుంబంలో రూ.12 వేలు కంటే తీసుకునే ఇతర ఆదాయం వచ్చేవారు, ఆదాయపు పన్ను చెల్లించడం, విద్యుత్ వినియోగం సగటున 300 యూనిట్లు కంటే ఎక్కువగా వాడటం, పట్టణ ప్రాంతంలో వెయ్యి చదరపు అడు స్థలంలో ఇల్లు కలిగి ఉన్నవారు, కుటుంబంలో నాలుగు చక్రాల వాహనం, వ్యవసాయ భూములు ఉన్న తదితర అంశాలను అనర్హులుగా చూపించి తల్లికివందనం పథకం నిలిపివేస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ప్రతిఒక్కరికీ తల్లికి వందనం పథకం ఇస్తామని చెప్పారు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి అర్హులుగా గుర్తించి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ప్రజల్లో ఆనందించారు. తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు వస్తాయని భావించిన లబ్ధిదారులకు మొదటి ఏడాది పథకం అమలు చేయకపోగా, ఈ ఏడాది ఇష్టానుసారం ఆంక్షలు నడుమ పథకం లబ్ధిదారుల జాబితా విడుదల చేయడంతో ప్రతిఒక్కరూ కంగుతిన్నారు. గత ప్రభుత్వమే చేసిన తప్పులే కూటమి ప్రభుత్వం చేయడంతో లబ్ధిదారులు ప్రభుత్వ తీరుపై పెదవి విరుస్తున్నారు.

లబ్ధిదారులు తల్లికి వందనం పథకానికి అనర్హులుగా గుర్తించడంతో ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎక్కువ మందికి 300 యూనిట్లు విద్యుత్ వినియోగిస్తున్నట్లు చూపిస్తుండగా, మరి కొంత మందికి రెవెన్యూ రికార్డుల్లో వ్యవసాయ భూములు ఉన్నట్లు అనర్హుల జాబితాలో చూపిస్తుండడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గంటల తరబడి సమయాన్ని వెచ్చించి అటు రెవెన్యూ, మున్సిపల్ సచివాలయం, ఎంపిడిఒ, విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ లబ్ధిదారులు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో అమ్మవడి పథకం వచ్చిందని, ఈ ఏడాది తల్లికి వందనం పథకం ఎందుకు నిలిపివేశారో అర్థం కాక లబోదిబోమంటున్నారు.

భూమి ఎక్కువ ఉందని ఇవ్వలేదు



గత ప్రభుత్వంలో అమ్మఒడి పథకం వచ్చింది. ఈ ఏడాదీ తల్లికి వందనం వస్తుందని అనుకున్నాను. కానీ రాలేదు. ఎందుకు రాలేదని సచివాలయం వద్దకు వెళ్లి అడిగితే నా పేరున పదెకరాలు ఉందని రికార్డులో చూపిస్తుతుందని, అందుకే రాలేదని చెబుతున్నారు. నా పేరున అంత భూమి లేదు. తాను నిరుపేద. నాలాంటి వాళ్లకి రాకపోవడం బాధగా ఉంది.

– సవర శాంతి, సవర రామకృష్ణాపురం

విద్యుత్ ఎక్కువ వచ్చిందని...



నాకు ఇద్దరు పిల్లలు ఉండడంతో రూ.26 వేలు వస్తుందని అనుకున్నాను. కానీ, ఒక్కరికీ రాలేదు. ఎందుకు రాలేదని ఆరా తీస్తే విద్యుత్ బిల్లు ఎక్కువగా వస్తుతుందని కారణం చూపించి తల్లికి వందనం పథకం రాలేదు. గతంలో డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. ఈ ఏడాది రాలేదు.

– పట్నాన రజిని, బ్రాహ్మణతర్ల

పాతపట్నం తహశీల్దార్‌గా ప్రసాదరావు

పాతపట్నం : పాతపట్నం తహశీల్దార్‌గా నందిగాం ప్రసాదరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సాధారణ బదిలీలో భాగంగా రణస్థలం మండలం నుంచి పాతపట్నానికి వచ్చారు. ఇంతకుముందు పనిచేసిన కిరణ్ కుమార్ రంగస్థలం మండలానికి బదిలీ అయ్యారు. పాతపట్నం రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ప్రభుత్వం అందిస్తున్న రెవెన్యూ సేవలు ప్రజల వినియోగించుకోవాలని కోరారు.

జర్నలిస్టు భాస్కరరావుకు బాలు పురస్కారం


భాస్కరరావు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సీనియర్ జర్నలిస్టు, ఫిల్మ్ డబ్బింగ్ ఆర్టిస్ట్, ఆల్ ఇండియా రేడియో బి గ్రేడ్ గాయకుడు కె.భాస్కరరావుకు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం స్మారక పురస్కారం అందజేశారు. జిబిఎ (ఘంటసాల, బాలు, ఆనంద్) స్వరమాధురి వెల్ఫేర్, సర్వీస్ సొసైటీ ఈ అవార్డును ప్రకటించింది. మూడు దశాబ్దాల కాలంలో గాయకునిగా తను చేసిన సామజిక సేవలతో పాటు తన ప్రతిభా పాటవాలను గుర్తించి తనని ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ నెల16 సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో నిర్వహించనున్న బాలూగాన సంగీత విభావరిలో భాస్కరరావు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ పురస్కారంపై అధికారులు, జర్నలిస్టులు, ఉపాధ్యాయులు హర్షాతిరేకాలు వెలిబుచ్చుతున్నారు.


నీరు విడిచిపెడుతున్న కుమార్ మోహన్ రెడ్డి

సీమూరుకు నీరు వచ్చింది

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

కవిటి: నెల రోజులుగా ఉద్దానం నీటి కోసం ఎదురు చూస్తున్న సీమూరుకు శనివారం నీటి సరఫరా అయ్యింది. 'అంపశయ్యపై' ఉద్దానం ప్రాజెక్టు కథనానికి స్పందించిన అధికారులు స్థానిక సర్పంచ్ ప్రతినిధి కుమార్ మోహన్ రెడ్డి సమన్వయంతో పైపులైనుకు మరమ్మతులు చేయించారు. దీంతో సీమూరు గ్రామంతో పాటు బైరెడ్ల పుట్టుగ, వడ్డిపుట్టుగ గ్రామాలకు నీటి సరఫరా అవుతుంది. నీటి సరఫరా నిలిచిపోయి చుక్క నీటి కోసం ఎదురు చూస్తున్న తమకు అండగా నిలిచి నీటి సరఫరా జరిగేలా చేసిన ప్రజాశక్తికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తే చర్యలు

కోటబొమ్మాళి: మాదక ద్రవ్యాలను క్రయవిక్రయాలు చేసినా, వినియోగించినా కఠిన శిక్షలు తప్పవని స్థానిక కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక హాడ్కో కాలనీలో మాదక ద్రవ్యాలపై గ్రామస్తులకు శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాలలో వివిధ రకాలున్నాయన్నారు. నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, గంజాయి, మారిజువానా, కొకైన్, ఎల్ఎస్‌డి తదితరవని అన్నారు. వీటికి అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువులు వదిలి సర్వస్వం కోల్పోయి నిర్భాగ్యులవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షులు, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి


లావేరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

ప్రజాశక్తి- లావేరు

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నడుకుదటి ఈశ్వరరావు అన్నారు. శనివారం లావేరులో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ 21న విశాఖపట్నంలో యోగా కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, సిఎం చంద్రబాబు పాల్గొనే కార్యక్రమానికి సంబంధించి అధికారులు, ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండలం నుంచి 148 బస్సుల్లో ఆరు వేల మందిని తరలించే విధంగా ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేసి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనువాసరావు, ఎంపిడిఒ పి. వెంకటరాజు, తహశీల్దార్ జిఎల్ఇ శ్రీనువాసరావు, టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ జెడ్‌పిటిసి పిన్నింటి మధుబాబు, లుకలాపు అప్పలనాయుడు, ఎపిఎం బి.వి.సుబ్బయ్య నాయుడు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: 21న విశాఖలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రజలు తరలిరావాలని స్థానిక ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, కూటమి నాయకులతో యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, కూటమి నాయకులు బెండు మల్లేశ్వరరావు, సంపతిరావు నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, రామారావు, పైడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ


పలాస : విత్తనాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

పలాస : రైతులకు అండగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టిడిపి నాయకులు దువ్వాడ సంతోష్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో రైతులకు విత్తనాలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే విత్తనాలు పంపిణీ చేశామని చెప్పారు. వంశధార ఇప్పటికే శివారు భూములకు సరఫరా అవుతుందన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఖరీఫ్ ముందుగా వంశధార, విత్తనాలు పంపిణీ చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దువ్వాడ సంతోష్, దువ్వాడ శ్రీహర్ష, శిష్టి గోపి, బూరెల కృష్ణంరాజు, తులసి, కిరణ్, బాబూరావు, రవి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని రత్తకన్నలో నీటి సంఘం అధ్యక్షులు బుగత జగన్ రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సుభాష్ రౌలో, గిన్నె లక్ష్మీనారాయణ, దుర్గా పిల్లయ్య, దుర్గ జోగయ్య, చంద్రయ్య, లాది సోమయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ దేవత ఉత్సవాలు

పొందూరు: పొందూరు పైడితల్లి అమ్మవారి గ్రామదేవత మహోత్సవాలు ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించనున్నారు. సుమారు 16 ఏళ్ల తరువాత ఈ పండుగను పొందూరుతో పాటు కృష్ణాపురం, లక్ష్మీపేట, జోగన్నపేట, ఎరుకలపేట, అలబోయినపేట, ఎరుకుల కాలనీ ప్రజలు జరుపుతున్నారు. దీంతో ఇతర జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి బంధువులు, స్నేహితులు తరలివస్తున్నారు.

పండగ నిర్వహణకు ఏర్పాట్లు

అమ్మవారి పండగ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పగడ్బందీగా ఏర్పాటు చేస్తున్నట్లు సిఐ పి.సత్యనారాయణ తెలిపారు. పండగ ఏర్పాట్లపై శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేఖరులతో మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు చేపట్టడంతో పాటు ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెట్టామన్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించడంలో భాగంగా పట్టణవాసుల వాహనాలతో పాటు పండగకు వచ్చేవారి వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించామన్నారు. వాహనాలను నిర్దేశిత ప్రదేశాల్లోనే నిలుపుదల చేయాలని కోరారు. ట్రాఫిక్‌ను నియంత్రించడంలో భాగంగా మూడురోజుల పాటు క్వారీ వాహనాలు పట్టణంలోకి ప్రవేశం నిషేదించడం జరిగిందన్నారు. వాహనాలు ప్రవేశించే రూట్లను నిర్దేశించడం జరిగిందని, వివిధ రూట్లలో వచ్చే వాహనాలు ఆయా రూట్లలోనే పొందూరు పట్టణంలోకి ప్రవేశించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ వి.సత్యనారాయణ ఉన్నారు.


మాట్లాడుతున్న సిఐ సత్యనారాయణ

నాన్నే నా హీరో


చిన్నాలతో కేకు కోయిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం సిటీ: నాన్నే నా మొదటి హీరో అని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని పిఎన్ కాలనీలో గల జోయ్ కిడ్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌లో శనివారం ముందస్తుగా ఫాదర్స్ డే వేడుకలను నిర్వహించారు. జోయ్ కిడ్స్ ఇంటర్నేషనల్ ప్లేస్కూల్ చిన్నారుల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి వారికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల కోసం కనపడే కష్టం అమ్మ పడుతుందని, కనపడని శ్రమ నాన్న చేస్తుంటారని అన్నారు. నాన్న మమకారం గుండెల్లో దాగి ఉంటాదన్నారు. తల్లితండ్రుల కష్టాన్ని అర్థం చేసుకుని పిల్లలు బాగా చదువుకుని, వారు ఎంచుకున్న రంగాల్లో రాణించాల న్నారు. చిన్నతనం నుంచి కష్టపడి చదువుకుని తల్లితండ్రుల ఆశలు నెరవేర్చాలని సూచించారు. అనంతరం చిన్నారుల బెస్ట్ ఫాదర్స్‌కు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో జోయ్ కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ జామి స్రవంతి కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత


పట్టుబడ్డ గేదెలు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని కొజ్జిరియా జాతీయ రహదారి ఫ్లైవర్ వద్ద శనివారం ఉదయం పశువుల అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు ఆరు గేదెలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కవిటి ఎస్ఐ రవివర్మ అందించిన సమాచారం మేరకు కోటబొమ్మాళి మండలం నారాయణవలసకు చెందిన దాకర ప్రకాశ రావు అనే వ్యక్తి ఒడిశా రాష్ట్రం గొలంతర నుంచి ఆరు గేదెలను కొనుగోలు చేసి లగేజీ వ్యానులో తిలారు సంతకు తరలిస్తున్నాడు. కొజ్జిరియా ఫ్లైవర్ వద్ద తనిఖీల్లో భాగంగా అడ్డుకున్నారు. లగేజీ వ్యాను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గేదెలను కొత్త వలస హెల్పింగ్ హాండ్స్ సంస్థకు అప్పగించినట్లు తెలిపారు.


రికార్డులను పరిశీలిస్తున్న మణీశ్వరి

షాపుల తనిఖీ

కొత్తూరు : కొత్తూరులో నవోదయం.2.0 కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ సిఐ మణీశ్వరి శనివారం షాపులను తనిఖీ చేశారు. దుకాణాల్లో బెల్లం అమ్మకాలు చేస్తున్నారా? లేదా? అని పరిశీలించారు. ఎంత బెల్లం విక్రయిస్తున్నారు, ఎంత నిల్వ ఉన్నది రికార్డులను పరిశీలించారు. ఈమెతో సిబ్బంది ఉన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

మృతుల కుటుంబాలకు సంతాపం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

అహ్మదాబాద్‌లో విమానం ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ సంతాపం తెలిపారు. శనివారం సాయంత్రం ఇందిరాగాంధీ కూడలి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు కొవ్వొత్తులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి, నందిగాం జెడ్‌పిటిసిలు పాల వసంతరెడ్డి, నడుపూరు శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి వైసిపి మండల అధ్యక్షులు సంపతరావు హేమసుందరరాజు, గురునాథ్ యాదవ్, బమ్మిడి వెంకటరావు, తమ్మన్నగారి కిరణ్, అట్లా రాహుల్‌కుమార్ పాల్గొన్నారు.


కురుస్తున్న వర్షం

కొత్తూరులో భారీ వర్షం

ప్రజాశక్తి- కొత్తూరు

మండల కేంద్రమైన కొత్తూరులో శనివారం సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో రహదారులు జలమయ్యాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అయితే పగలంతా ఎండ వేడితో, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై వర్షం కురవడంతో కొంత ఉపశమనం కలిగినట్లు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

తిరుమలరావుకు ప్రథమ బహుమతి


తిరుమలరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జి.సిగడాం మండలం పాల ఖండ్యాం ఎంపియుపి పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేస్తున్న కుదమ తిరుమల రావు జాతీయ స్థాయి కవితల పోటీలో ప్రథమంగా నిలిచారు. విమల సాహితీ సమితి ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఈ పోటీల్లో తిరుమలరావు పాల్గొని, కవిత పంపగా న్యాయనిర్ణేతల బృందం ప్రథమ స్థానానికి ఎంపిక చేసి ప్రశంసాపత్రం పంపారు. హైదరాబాద్ కేంద్రంగా చదువులమ్మ ఒడి సర్కారు బడి అను అంశంపై కవితల పోటీలను నిర్వహించగా తిరుమలరావు పంపిన ప్రకృతి ఒడి ప్రభుత్వ బడి అను కవిత ప్రథమ బహుమతికి ఎంపికైంది. విమల సాహితీ సమితి అధ్యక్షులు డా.జెల్ది విద్యాధర్ ఆధ్వర్యంలో తరుమెళ్ల కల్యాణి సమన్వయంతో పోటీలు నిర్వహించగా శైలజామిత్ర న్యాయనిర్ణేతల బృందం తిరుమలరావును అభినం దిస్తూ ప్రశంసాపత్రం పంపించారు. ప్రథమ బహు మతి సాధించడంపై రాజాం రచయితల వేదిక కన్వీనర్ గార రంగనాథం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రక్తదానంతో ప్రాణదానం



ఇచ్ఛాపురం : ప్రశంసాపత్రం అందజేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలో శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. శ్రీకాకుళం పట్టణంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ట్రెజరీ శాఖ సిబ్బంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు. నగరంలోని న్యూ బ్లడ్ బ్యాంక్‌లో తైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మెగా అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రవణ స్వామి నాయుడు, అధ్యక్షులు చింతామణి మహేష్, న్యూ బ్లడ్ బ్యాంకు మేనేజర్ మణికంఠ ఆధ్వర్యంలో సిబ్బంది రక్తాన్ని సేకరించారు. చిరంజీవి, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.


కవిటి : రక్తదానం చేస్తున్న యువకులు

కవిటి: ఆరోగ్యకరమైన యువత జీవితంలో ఒక్కసారైనా రక్తదానం చేయాలని సోంపేట కోర్టు న్యాయమూర్తి, ఆరో అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి కోడూరు కిషోర్‌బాబు, సోంపేట సిఐ మంగరాజు సూచించారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా బొరివంక కేంద్రంగా పనిచేస్తున్న హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ప్రాణదాత రక్త నిధి కేంద్రం సౌజన్యంతో సీతయ్య ఫౌండేషన్‌లో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 50మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి యువతకు స్ఫూర్తిగా నిలిచారు. కార్యక్రమంలో సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు రమేష్, మోహన్, హెల్పింగ్ హేండ్స్ సభ్యులు కాళీ సాహు, విశ్వేశ్వరరావు, గణేష్, శ్యామ్, దేవరాజు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రపంచ రక్తదాతల దినోత్సవంలో భాగంగా జెసిఐ అధ్యక్షులు కాళ్ల జైదేవ్ ఆధ్వర్యాన శ్రీకాకుళం గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రితో కలిసి మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 52 రక్త యూనిట్లు సేకరించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళానికి చెందిన 191 సార్లు రక్తదానం చేసిన బొడ్డేపల్లి శ్రీనివాస్‌ను సన్మానించారు. శ్రీనివాస్‌ని సన్మానించడం జరిగింది. సెక్రటరీ డాక్టర్ మోహన్ వెంకటేష్, ప్రాజెక్టు చైర్మన్ డాక్టర్ వెచ్చ సంతోష్, జోన్ అధికారి తంగుడు షణ్ముఖ, సంతోష్ సాహూ, దిల్లేసు, డాక్టర్ మట్టా శ్రీనివాస రావు, వెచ్చ రాము, వెచ్చ వాసవి, పవన్, మల్లేష, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

పలాస : క్యాష్యు లేబర్, రైస్ మిల్లర్స్ కార్మికుల భవనం వద్ద ఆ నలుగురు ట్రస్టు ఆధ్వర్యాన నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కాశీబుగ్గ డిఎస్‌పి వెంకట అప్పారావు ప్రారంభించారు.. ఈ శిబిరంలో 20 మంది తమ రక్తం దానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు. కార్యక్రమంలో సానా ఈశ్వరరావు, టెంక తేజేశ్వరరావు, రాజు, నరేష్, మన్మథ, వేణు, క్యాషు లేబర్ యూనియన్ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, సింహాచలం, రాము, నాగేశ్వరరావు, మోహన్, ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ మేనేజర్ సాయి పాల్గొన్నారు.


శ్రీకాకుళం సిటీ : రక్తదానం చేస్తున్న ట్రెజరీ ఉద్యోగులు

సోంపేట : ప్రపంచ రక్తదానం దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలో ఎస్‌జిఎఫ్ సంస్థ, ఎస్ఎస్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసినట్లు నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు. డాక్టర్ లక్ష్మీనారాయణ, వాసు, వంశి, సాయి పాల్గొన్నారు.